## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-12-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు భగవాన్ జయంతి. పరబ్రహ్మము రూపరహితము, నామరహితము, గుణరహితము. కాని భగవంతుడిని ఒక పేరుతో పిలవాలి అంటే అది నారాయణ శబ్దంతోటి వేదంలో పిలిచారు. శవవాహకులు శవాన్ని మోసేటప్పుడు, దించేటప్పుడు నారాయణ, నారాయణ, నారాయణ అని ఆ నామమే స్మరిస్తారు.

మీకు ఆత్మానుభవం కలగాలి అంటే రమణమహర్షిగారి లాగ మనకీ వచ్చేస్తుంది అని మీరు అనుకోవద్దు. ఆయన కూడా ప్రాక్టీసు అవసరమనే చెప్పారు. భగవాన్ జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటన మరణానుభవం. మనోదేహములతోటి సంబంధంలేకుండా చావులేని సద్వస్తువు ఒకటి ఉందని ఆయనకు తెలియదు. కనీసం దానిగురించి శ్రవణం కూడా చేయకుండా బ్రాహ్మీస్థితిని పొందినవాడు ఒక్క ఇండియాలోకాదు, వరల్డ్‌హిస్టరీలో ఈరకంగా ఆత్మానుభవం పొందినవాడు ఏ దేశంలోను లేడు. భగవాన్ ఒకరోజున గదిలో కూర్చుని ఇంగ్లీషు గ్రామరు వ్రాస్తున్నారు, వ్రాస్తూఉంటే అకస్మాత్తుగా మరణం వచ్చి మీద పడింది. ఆయన శరీరం శవం అయ్యింది. శరీరం చనిపోయినట్టు ఆయనకు తెలుస్తోంది. శరీరం తోటి సంబంధంలేకుండా ఆయన ఉన్నట్టు తెలుస్తోంది. శరీరం చనిపోయినప్పుడు 'నేను' చనిపోవాలికదా! నేను ఉన్నాను ఏమిటి. శరీరానికి, నాకు ముల్లంత, రవ్వంత కూడా సంబంధం లేకుండా నేను ఉన్నాను అని ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. అంటే మరణానుభవం ద్వారా మరణంలేనిస్థితిని పొందారు. మనం అందరం ఏదో ఒక రోజున చనిపోతాం. చనిపోయేరోజు ఏమనుకుంటాం. నేను చనిపోతున్నాను అనుకొంటాడు. భగవాన్ చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకోలేదు. శరీరానికీ నాకూ ఉన్న సంబంధం తెగిపోతోంది అనుకున్నాడు. శరీరంతోటి సంబంధం లేకుండా నేను ఉన్నాను. ఆ ఉండటం ఎలా ఉన్నాడు. ఆనందంగా ఉన్నాడు, శాంతిగా ఉన్నాడు, సుఖంగా ఉన్నాడు. ఎప్పుడైతే మరణానుభవం పొందాడో ఆయన భయరహితుడు అయ్యాడు. ద్వైతంలోంచి భయం వస్తుంది కాని అద్వైతంలోనుండి భయంరాదు. రమణమహర్షిగారు అద్వైతస్థితిని పొందారు. మహాత్మాగాంధీగారికి ఫేవరేట్ గ్రంథం భగవద్గీత. గీత నాకు తల్లి అనిచెప్పారు. నా మనస్సు అంతా చీకటిగా ఉన్నప్పుడు, స్వాతంత్ర్యసమరంలో ఏ నిర్ణయం తీసుకోవాలి అని నాకు తొయ్యనప్పుడు భగవద్గీత తీసి చదువుతూ ఉంటే తరువాత స్టెప్ ఏమిటి అనే ఆలోచన

నాకు వచ్చేది. అప్పుడు ఆ చీకటి అంతా పోయేది. భగవద్గీతలో స్థితప్రజ్ఞుడి లక్షణాలు, బైబిల్‌లో కొండమీద ప్రసంగము గాంధీగారు రోజూ అధ్యయనం చేసేవారు. అందుచేత ఆయన భయరహితుడు అయ్యారు. గాంధీగారితో సమానమైన తెలివైనవారు, సమర్థులు ఉన్నారు కాని గాంధీగారిలో విశేషం ఏమిటంటే ఆయన ప్రాణంమీద ఆయనకి ప్రీతిలేదు. ఉద్యమాలలో ఆయన రోజూ బయటకు వెళ్ళేటప్పుడు సాయంత్రానికి నేను ఇంటికి రావచ్చు, రాకపోవచ్చు అని చెప్పివెళ్ళేవాడు. అంటే స్వాతంత్ర్యం కోసం అవసరమైతే ఆయన ప్రాణాన్ని గడ్డిపరక కింద విడిచిపెట్టేయాలనే మనస్థత్వం కలవాడు. అందుచేత ఆయన లీడరు అవ్వగలిగాడు. నేను ఉన్నాను, భగవంతుడు లేడు అని మనం అనుకొంటున్నాము. ఎందుచేతనంటే మనకి తపస్సు లేకపోవటం వల్ల, అధ్యయనం లేకపోవటం వల్ల, సజ్జనసాంగత్యం లేకపోవటం వల్ల, అనుభవం లేకపోవటం వలన అలా అనుకుంటున్నాము. మనకి నిజంగా ఆత్మజ్ఞానం కావాలి అంటే సమాజానికి ఎదురు ఈదాలి. ముందు శ్రవణం చెయ్యాలి శ్రవణం చెయ్యగా, చెయ్యగా బుద్ధి స్థిరపడుతుంది. సబ్జక్టు శ్రవణంచేసి మననం చెయ్యాలి. నేను లేను భగవంతుడు ఉన్నాడు అని నోటితో చెప్పటం కాదు. అది అనుభవం లోనికి తెచ్చుకోవాలి. అదే ఆత్మజ్ఞానం.

రమణమహర్షి, రామకృష్ణపరమహంస వీళ్ళని జీవన్ముక్తులు అంటారు. అంటే శరీరం ఉండగా ఎవడికయితే సూక్ష్మశరీరం కాలిపోయిందో వాడిని జీవన్ముక్తుడు అంటారు. అలా కాకుండా శరీరం చనిపోయినప్పుడు మాత్రమే ఈ శరీరంతో పాటు సూక్ష్మదేహం ఎవరికైతే కాలిందో వాళ్ళని విదేహముక్తులు అంటారు. పూర్వజన్మకు సంబంధించిన కర్మఫలాలు జీవన్ముక్తుడికి అనుభవంలోనికి వచ్చినా, చూచేవాడికి వాడు కర్మ అనుభవిస్తునట్లు అనిపిస్తుంది. కానీ జీవన్ముక్తుడికి నేను కర్మ అనుభవిస్తున్నాను అని అనిపించదు. ఏ నేను అయితే అలా అనుకుంటుందో ఆ నేను అక్కడ లేదు. జ్ఞాని దేహం దాని ప్రారబ్ధం ప్రకారం ప్రయాణం చేస్తున్నా అది వాడికి ఏమీ అంటదు. అంటే దాని తాలూక ప్రభావం వీడి నెత్తి మీద ఉండదు. వాడు వరల్డ్‌లెస్, బాడీలెస్, గాడ్‌లెస్, ఎవ్రీథింగ్ ఈజ్‌లెస్. వాడికి దేహవాసన లేదు. కర్మఫలం దేహవాసన ఉన్నవాడిని బాధపెడుతుంది. దూడని కట్రాడికి కట్టేసి ఆ దూడని మీరు ఎన్ని దెబ్బలు కొట్టినా అది పడుతుంది. ఎందుచేత కట్రాడికి కట్టేసి ఉంచారు కాబట్టి. అది తెంపుకు వెళ్ళిపోయింది అనుకోండి, యజమాని కొట్టాలంటే దొరుకుతుందా? అది దొరకదు. ఈ జీవన్ముక్తులు అందరూ తాడు తెంపుకు వెళ్ళిపోయారు. ఈ మాయని

కోసేసుకుని వెళ్ళిపోయారు. ఇంక దేవుడు కూడా వారిని ఏమీ చెయ్యలేడు. దేహము నేను కానప్పుడు, దేహమే నేను అనే బుద్ధి నాకు భగవంతుడు ఎందుకు పెట్టాడు అని ఒకరు అడిగారు. పూర్వజన్మలో నువ్వు మంచి చేస్తే మంచి, చెడ్డ చేస్తే చెడ్డ నీచేత అనుభవింపచేయటానికి దేహము నేను అనే బుద్ధి గాఢంగా, గూఢంగా పెట్టాడు. ఇది కర్మ సిద్ధాంతం. దూడని కట్రాడుకి కట్టేసినట్టు నిన్ను దేహానికి కట్టేసాడు. మీరు సాధనచేసి, సాధనచేసి దేహము నేను అనే బుద్ధిని మీరు పోగొట్టుకున్నారు అనుకోండి. ఇంక ప్రారబ్ధం అనుభవించేవాడు ఉండడు. వాడు దేవుని స్వరూపం పొందుతాడు.

అయామ్ దట్ అయామ్. నేను ఉన్నాను, ఉన్నదేదో నేను అయిఉన్నాను అని ఏసుక్రీస్తు చెప్పాడు. మీకు అనుభవంలో లేకపోవటం వలన ఇవన్నీ అబద్ధాలు అనిపిస్తున్నాయి. కానీ అది నేకెడ్ ట్రూత్, 100% ట్రూత్. మీరు నమ్మండి, నమ్మకపోండి అది అనవసరం. మీ నమ్మకాల మీద అది ఆధారపడిలేదు. అసలు నమ్మకాలు, కల్పితాలు ఊడగొట్టటమే ఈ సమావేశాల ప్రత్యేకత. ఉన్నది ఏదో ఉంది. అది మార్పులేనిది. సినిమా తెరఉంటుంది. ఆ తెర అలాగే ఉంటుంది. తెర ఏమీ కదలదు. దానిమీద బొమ్మలు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. అలాగే చైతన్యం అనే తెరమీద మన శరీరాలు పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, చస్తున్నాయి. తెర నిజమే కాని, తెరమీద బొమ్మలు నిజం కాదు. చైతన్యం ఒక్కటే నిజం. ఈ పుట్టటాలు, చావటాలు నిజం కాదు. అయామ్ దట్ అయామ్ ఈవాక్యం చదివి రమణమహర్షిగారు పొంగిపోయారు. మీకు శరీరం అనుభవంలో ఉంది. ఇష్టాలు, అయిష్టాలు అనుభవంలో ఉన్నాయి. శత్రుత్వాలు, మిత్రత్వాలు అనుభవంలో ఉన్నాయి. అలాగ అయామ్ దట్ అయామ్ ఈ వాక్యం మీకు అనుభవంలోనికి రావాలి. మీకు పదివాక్యాలు అక్కరలేదు. మీరు ఇంటికి వెళ్ళిన తరువాత ఈ వాక్యాన్ని మీ మైండులో పెట్టి రుబ్బేయండి. వాక్యము దేవుడై ఉన్నది. దేవుడికి, దేవుడు చెప్పిన వాక్యానికీ తేడా ఉండదు. భగవంతుడు వాడి హృదయాన్నే తీసి మీకు సమర్పిస్తున్నాడు. ఏసుక్రీస్తుని శిలువవేసి చంపారు. నాకు మరణం లేదు మళ్ళీ మూడవరోజున లెగుస్తాను అన్నాడు. ఏసుప్రభువు నిజంగా లెగుస్తాడేమో అని వీళ్ళు చాలా పెద్దగొయ్యి తీసేసి ఏసుప్రభువుని అందులోపెట్టేసి పైన రాళ్ళు వేసేసారు. ఒకవేళ మట్టి అయితే గెంటుకు వచ్చేస్తాడేమో అని ఇంక లేవకుండా పెద్దరాయి పరిచేసారు. కానీ మూడవరోజున ఏసుప్రభువు లెగిసి వచ్చేసాడు. ముందు మరియకి కనిపించాడు. ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను, దానికి చావులేదు అని ఏసు ప్రభువు నిరూపించాడు. ఏసు ప్రభువు

పుట్టిన రోజును క్రిస్టమస్ అంటారు. చనిపోయిన రోజును గుడ్‌ఫ్రైడే అంటారు. చచ్చిపోయిన రోజు మంచిరోజు అని ఎవరు అంటారు. గుడ్‌ఫ్రైడే అంటే తనకోసం కాకుండా ప్రజలకోసం తన ప్రాణాన్ని అర్పించాడు కాబట్టి అది మంచి శుక్రవారం అయ్యింది.

హీనయానం, మహాయానం ఇది బుద్ధుడు శాఖ. కొంతమంది ఏమనుకుంటారు అంటే మేము బాగుపడితేచాలు, మాకు జ్ఞానం వస్తే సరిపోతుంది అంటారు. వివేకానందుడు కూడా రామకృష్ణుడి దగ్గర నేను మోక్షసుఖం పొందితే సరిపోతుంది అనేవాడు. యు విల్ టీచ్ ద వరల్డ్ అని చెబితే ఆ వరల్డ్ గొడవ నాకు వద్దు, నేను తరిస్తే సరిపోతుంది అనేవాడు. దానికి రామకృష్ణుడు ఒప్పకునేవాడు కాదు. నువ్వు ఒక్కడివే తరిస్తే కాదు, నీతోపాటు పదిమంది తరించాలి. ఇది మహాయానం. మహాయానాన్ని తీసుకువచ్చినవాడు నాగార్జునుడు. కొంతమంది ఏమంటారు అంటే ముందు మమ్మల్ని తరించనివ్వండి. మిగతావాళ్ళ విషయం తరువాత అని వారికే పరిమితమై ఉంటారు వీరిని హీనయానం అంటారు. కొంతమంది జ్ఞానులు కూడా వాళ్ళ దగ్గరకి వెళితే ఏదైనా చెబుతారు, లేకపోతే చెప్పరు. కొంతమంది ఇతరులకి కూడా అందించటానికి ఎక్కువ కృషి చేస్తారు. భగవద్గీతలో భగవంతుడు ఏమని చెప్పాడంటే అర్జునా నీకు నాకు మధ్య జరిగిన ఈ సంభాషణ అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొని నువ్వు ఇతరులకి బోధించగలిగితే అంతకంటే ఈ సృష్టిలో మంచిపని లేదు. ఇది భగవంతుడు చెప్పినమాట, ఒక మనిషి చెప్పింది కాదు.

నీ బుద్ధి బ్రహ్మములో కనుక స్థిరపడితే ప్రపంచంలో ఉన్న ఆకర్షణలు చూచినా నీకు ఏ రకమైన వికారం రాదు. జీవకోటికి, ప్రపంచానికి, పంచభూతాలకి ఆధారముగా చైతన్యశక్తి ఉంది. అది సాక్షిగా ఉంటుంది. పాపం చేసేది, పుణ్యం చేసేది జీవుడే. కానీ చైతన్యం చూస్తూ ఉంటుంది. చైతన్యానికి ఇది రాత్రీ, పగలు అని లేదు. చైతన్యం డెత్‌లెస్, బర్త్‌లెస్. అది సనాతనమైనది. నీకు ఎప్పుడు ఏది ఇవ్వాలో చైతన్యం ద్వారా జరుగుతూ ఉంటుంది. అది ఆటోమేటిక్‌గా జరిగిపోతూ ఉంటుంది. చైతన్యం పనిచేస్తున్నా చెయ్యని దానితోటి సమానం. ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వం ఉండదు. నువ్వు కర్త లేకుండా పనిచేస్తే నీకు కర్మ అంటుకోదు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. ఉపనిషత్తులలో మన ఋషులు ఆత్మానందం, ఆత్మశాంతి పొందమని, అది సాధించమని ఎక్కువ చెప్పారు. ఎందుకు చెప్పారంటే నువ్వు ఆత్మానందం పొందాక, ఆత్మశాంతి పొందాక నీకు బాహ్య

విషయాలమీద ఆకర్షణ ఉండదు. మొత్తం ప్రపంచం అంతా కూడా నీకు కాకి రెట్టతోటి సమానంగా కనిపిస్తుంది. ఇంక పతనం అవుతాము అనే భయం నీకు ఉండదు. రామకృష్ణుడు చెప్పిన వాక్యం మరిచిపోకండి. భగవంతుడే ఉన్నాడు, నేను లేను అది మీకు అనుభవంలోనికి రావాలి. కానీ మన అనుభవంలో ఏమి ఉంది అంటే నేను ఉన్నాను. భగవంతుడు లేడు. మీకు దేహప్రారబ్ధాన్నిబట్టి ఎప్పడైనా దుఃఖం వచ్చినప్పటికీ పాయసం నోట్లో వేసుకున్నప్పడు నువ్వు ఎలా ఎంజాయ్ చేస్తావో అలా నీ దేహం యొక్క చెడ్డ ప్రారబ్ధాన్ని కూడా ఎంజాయ్ చెయ్యటం ప్రాక్టీసు చెయ్యి. ఈ చెడ్డరోజులు ఎప్పడు వెళ్ళిపోతాయి, మళ్ళీ మంచి రోజులు ఎప్పడు వస్తాయి అని కనిపెట్టుకుని ఉండకండి. చెడ్డ ప్రారబ్ధాన్ని ఎంజాయ్ చెయ్యకపోతే వచ్చే జన్మలో మళ్ళీ అదే వస్తుంది. ఎంజాయ్ చేసారు అనుకోండి ఇంక వచ్చే జన్మలో అది రాదు. తుకారామ్ ఏమన్నాడు అంటే ఓ రంగా, పాండురంగా నువ్వు నీ దగ్గర ఎన్ని కష్టాలు ఉన్నాయో అన్నీ నాకు పంపేసావు కానీ నీ మీద భక్తికాని, నీ మీద ప్రేమకాని, నీ మీద ఆప్యాయతకాని నాకు ఏమీ తగ్గలేదు. ఇంకా నీ దగ్గర ఏమైనా కష్టాలు ఉంటే పంపించు నేను భరిస్తాను అన్నాడు. భూమికి ఎంత సహనం ఉందో తుకారామ్‌కి కూడా అంత సహనం ఉంది. ఆ సహనానికి బహుమతిగా వాడికి వైకుంఠంనుంచి విమానం వచ్చింది. రంగడి తోటి ఫేస్ టు ఫేస్ మాట్లాడిన వాడు తుకారామ్. అది నిజమా అని మీరు అనుకోవచ్చు. మీ ఏకాగ్రత బలీయమైనది అయితే, మీ పవిత్రత బలీయమైనది అయితే భగవంతుడు రూపం దాల్చి వచ్చి మీతోటి మాట్లాడతాడు. శుద్ధ అద్వైతి అయినటువంటి రమణమహర్షి కూడా ఈ మాటని ఒప్పకున్నారు. నువ్వు పవిత్ర మనస్కుడివి అయితే నీకు ఏకాగ్రత ఉంటే, ప్రవీణత ఉంటే భగవంతుడికి రూపం లేకపోయినా నీకోసం ఒక రూపం ధరించి అవతరిస్తాడు. అలా ప్రహ్లాదుడికోసం నరసింహస్వామి అవతరించాడు కదా అన్నారు. ఇవన్నీ వ్యవహారికంగా నిజమని భగవాన్ ఒప్పకుంటారు కానీ పారమార్థిక సత్యాలు కాదు. రమణమహర్షిగారిని ఆయన చివరిరోజులలో మీరు వెళ్ళిపోతున్నారు మేము ఉండిపోతున్నాము అని ఒకరు అన్నారు. అప్పడు ఆయన ఏమన్నారు అంటే నాకు వెళ్ళటానికి చోటు ఎక్కడైనా ఉంటే వెళ్ళవచ్చు చోటు ఎక్కడ ఉంది అన్నారు. అంటే బ్రాహ్మీస్థితి పొందినవాడు అంతటా ఉంటాడు. వాడికి గోయింగ్ లేదు, కమింగు లేదు. కమింగు, గోయింగు అనేవి జీవ లక్షణాలు.

రాగము, భయము, క్రోధము వీటిని వదిలిపెట్టటానికి ప్రయత్నం చెయ్యండి. ఎక్కడైతే రాగం ఉంటుందో అక్కడ ఎటాచ్‌మెంట్ ఉంటుంది. ఎటాచ్‌మెంటు వల్లే దుఃఖం వస్తుంది.

ఎటాచ్‌మెంట్ లేనివాడికి దుఃఖం లేదు. మీ ఇంట్లో వాళ్ళపట్ల డ్యూటీ చెయ్యి. ఎటాచ్‌మెంట్ పెట్టుకోవద్దు. ఎటాచ్‌మెంట్ పెట్టుకుంటే టెన్షన్ వచ్చేస్తుంది, భయం వచ్చేస్తుంది, చావు వచ్చేస్తుంది. ఫిజికల్‌గా, మెంటల్‌గా నీ ఆరోగ్యం చెడగొట్టుకుంటావు. మీ పిల్లల మీద మీకు ప్రేమ ఉన్నా ప్రేమ ఉన్నట్టు చూపించకూడదు. ప్రేమ ఉన్నట్టు చూపిస్తే పిల్లలు పాడైపోతారు. నువ్వు వాళ్ళ వెల్‌ఫేర్‌కోసం పనిచెయ్యి. అలాగే సమాజం తాలూకు వెల్‌ఫేర్ గురించి కూడా పనిచెయ్యి. బ్రాహ్మీస్థితి పొందేవరకూ ఏ మనిషినీ భయం విడిచిపెట్టదు. చచ్చిపోతాం అంటే అందరికీ భయమే. చచ్చిపోతాం అంటే ఇక్కడ భయంలేనివారు ఎవరు ఉన్నారు. మీరు వ్యాపారం చేసుకుంటూ ఉంటే దానిలో పదిరూపాయలు నష్టం వస్తే మీకు భయం కదా. మార్కెట్ మీకు అనుకూలంగా లేకపోతే భయం కదా. ఏ స్థితిలో అయితే భయం లేదో ఆ స్థితికి మీరు చేరుకునేవరకూ ప్రతీ మనిషినీ భయం వెంటాడుతూ ఉంటుంది. భయం విడిచిపెట్టదు. కొంతమందికి జరుగుబాటు కోపం వస్తూ ఉంటుంది. కొంతమంది కోపం వచ్చినప్పుడు ఎదురుగుండా ఉన్న వాళ్ళని తిట్టేస్తారు. సత్‌పురుషులకి కూడా ఎప్పుడైనా కోపం వచ్చినా నీటిమీద గీతలా ఉంటుంది. కోపం వస్తే మీకు బేలెన్స్ తింకింగ్ తగ్గిపోతుంది. బ్రెయిన్ సరిగ్గా పనిచెయ్యదు మీరు తప్పులు చేస్తారు. కోపం ఎక్కువ అయినప్పుడు మీకు కరెక్టు జడ్జిమెంట్ రాదు.

రాగము, భయము, క్రోధము ఈ మూడూ కూడా మీకు ప్రోపర్ తింకింగ్ రానివ్వవు. ఈ మూడూ మనస్సుని, ఇంద్రియాలని రెచ్చగొడతాయి, నిన్ను అంతర్ముఖం అవ్వనివ్వవు. మీ భర్తకి కోపం వచ్చినప్పుడు మీరు ఎదురుచెప్పకండి. ఇంద్రియాలు వాళ్ళకి కంట్రోలులో ఉండవు. కొంతమంది కొట్టేస్తారు. వాళ్ళకి కోపం వచ్చినప్పుడు మీరు ఒక పదినిమిషాలు పక్కకి తప్పకోండి. నెమ్మదిగా వాళ్ళ కోపం చల్లారిపోతుంది. రాగము, భయము, క్రోధము ఈ మూడూ కంట్రోలు చేసుకున్నవాడు మాత్రమే స్థితప్రజ్ఞుడు అవుతాడు.

యోగః కర్మసుకౌశలం అంటే నువ్వు రామనామం చెయ్యటమే కాదు. భగవంతుడు నీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని ఎలా చెయ్యాలో నూటికి నూరుపాళ్ళు పెరఫెక్టుగా చేస్తే అది కూడా యోగంతోటి సమానం. అది వంట పని అవ్వవచ్చు, వ్యవసాయపని అవ్వవచు, సైన్సుకి సంబంధించినది అవ్వవచ్చు, ఏదైనా నువ్వు చేసేది నేర్పుగా, ఓర్పుగా చేస్తే అందులో కూడా యోగం ఇమిడి ఉంది. నువ్వు పని బాగా చెయ్యాలి, జపం బాగా చెయ్యాలి, ధ్యానం బాగా చెయ్యాలి అని చెబితే సరిపోదు. నువ్వు ముందు నిర్మలంగా,

